


కేంద్ర మంత్రులను కలిసిన బీకే

పుట్టపర్తి, జూన్25(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్‌ను హిందూపురం ఎంపీ బీకే పార్థసారధి మంగళవారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు బీకే తెలిపారు.



కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడుతో బీకే

ముదిగుబ్బలో మాజీ ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేసిన గుట్ట





బత్తలపల్లి ఆర్టీసీ బస్టాండు పక్కన కబ్జా అయిన స్థలం



ఊరూరా.. కబ్జాలు..!

వైసీపీ హయాంలో పేట్రేగిపోయిన కబ్జారాయుళ్లు

ధర్మవరం నియోజకవర్గంలో ఆక్రమణల పర్వం

వైసీపీ హయాంలో కబ్జారాయుళ్లు పేట్రేగిపోయారు. ధర్మవరం నియోజకవర్గంలో కబ్జాల పర్వం సాగించారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములను విచ్చలవిడిగా ఆక్రమించేశారు. భూవివాదాల్లోకి కలుగజేసుకుని, ఇరువర్గాలను బెదిరించి, తక్కువ ధరకే వాటిని లాగేసుకున్నారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అఖరుకు ధర్మవరం చెరువునూ వదల్లేదు. చుట్టూ ఆక్రమించి, వ్యాపార సముదాయాలు కట్టేశారు. చెరువు మధ్యలో ఏకంగా గుర్రాల కోట ఏర్పాటు చేసుకున్నారు. ఏ ఊరికెళ్లినా వైసీపీ నాయకుల కబ్జాలే కనిపిస్తున్నాయి. కొండలు, గుట్టలను కూడా వదల్లేదు. వారి ఆగడాలకు భయపడి ఎందరో ఆస్తులను వదులుకున్నారు. వేలాది ఎకరాల భూములు ఆ దౌర్జన్యపరులకు అప్పగించి, వారు ఇచ్చిందే తీసుకుని మిన్నకుండిపోవాల్సి వచ్చింది. ప్రశ్నిస్తే కేసులు పెడతామంటూ బెదిరించారు. అక్కడికీ వినకపోతే పోలీసులను ఉసిగొలిపి, వారిని భయాందోళనలకు లోనుచేసిన ఉదంతాలు కోకొల్లలు. ఇలా.. నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు రూ.10వేల కోట్ల విలువైన భూములను దోచేశారన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. రెవెన్యూ యంత్రాంగాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ భూములను యథేచ్ఛగా దోచేశారన్న విమర్శలున్నాయి. సార్వత్రిక ఎన్నికల్లో సత్యకుమార్ యాదవ్ గెలవడం, మంత్రి పదవి దక్కడంతో నియోజకవర్గ ప్రజల్లో ఆశలు చిగురించాయి. తమ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు. కబ్జారాయుళ్ల నుంచి తమ భూములను మంత్రి కాపాడి తమకు అండగా నిలుస్తారన్న ధీమాతో ఉన్నారు. - ధర్మవరం

> ప్రభుత్వ, ప్రైవేటు భూములు స్వాహా
>
> బెదిరించి వివాదాస్పద భూములూ కైవసం



ధర్మవరం స్పందన ఆస్పత్రి ఎదురుగా ఆక్రమించిన స్థలంలో వెలసిన టీ కేఫ్‌లు

నియోజకవర్గంలో వైసీపీ కబ్జాల పర్వాన్ని పరిశీలిస్తే..

- మాజీ ప్రజాప్రతినిధి నియోజకవర్గంలో చాలా భూవివాదాల్లో కలుగజేసుకున్నారన్నది బహిరంగ రహస్యమే. ఇరువర్గాలను బెదిరించి, విలువైన భూములను అతితక్కువ ధరకే లాక్కున్నారన్న ఆరోపణలు కోకొల్లలు.
- ధర్మవరం మండలంలోని తుంపర్తి పొలంలో గుర్రాల కోటలో 904, 905, 908, 909 సర్వే నంబర్లలో మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి తమ్ముడి భార్య గాలి వసుమతి పేరుతో 25.3 ఎకరాలు స్థానిక రైతులను బెదిరించి, తక్కువ ధరకే లాక్కున్నారన్న ఆరోపణలున్నాయి. మరో 20 ఎకరాలు కబ్జా చేసినట్లు వాదనలు వినిపిస్తున్నాయి. గాలి వసుమతి పేరుతో కొనుగోలు చేసిన భూమి ఆమె పిత్రార్జితంగా పేర్కొనడం పలువురిని ఆశ్చర్యానికి లోనుచేస్తోంది. కర్నూలుకు చెందిన గాలి వసుమతికి ఇక్కడ వంశపారంపర్యంగా భూములు ఎలా సంక్రమిస్తాయని రైతులు ప్రశ్నిస్తున్నారు.
- 1750 ఎకరాల విస్తీర్ణంగల ధర్మవరం చెరువు వైసీపీ దురాక్రమణలతో వెయ్యి ఎకరాలకు కుంచించుకుపోయింది. దీంతో చెరువు నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి, పంటకు పూర్తిస్థాయిలో నీరిచ్చుకోలేని దుస్థితి ఏర్పడింది. దీంతో చెరువు ఆయకట్టు కింద ఉన్న వేలాది ఎకరాలు బీళ్లుగా మారాయి. వైసీపీ హయాంలో సాయిబాబా ఆలయ సమీపాన వంద ఎకరాలదాకా కబ్జా చేసి, వివిధ వ్యాపారాలకు అద్దెలకు ఇచ్చుకున్నారు.
- పేదలకు అందాల్సిన ఎన్నో ఇంటి పట్టాలు వైసీపీ హయాంలో ఆ పార్టీకి చెందిన కొందరు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. దీంతో అర్హులకు ఇంటిపట్టాలు అందలేదు.
- తుంపర్తి రోడ్డులోని అత్యంత విలువైన స్థలాలను కొందరు కౌన్సిలర్లు, బడా నాయకులు ఆక్రమించుకుని, వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేసుకున్నారు.
- పుట్టపర్తి రోడ్డులో ఓ నర్సింగ్ హోం ఎదురుగా ప్లంబర్లకు కేటాయించిన భూమిలో వైసీపీ నాయకులు పంచాయితీలు పెట్టి, సెంటు రూ.50లక్షలు విలువచేసే స్థలాలను అధికారం అండతో లాక్కుని, నిర్మాణాలు చేపట్టారు.
- పుట్టపర్తి రహదారిలోని ఎల్‌సీకే పురం ప్రధాన రహదారి పక్కన కోట్లాది రూపాయల విలువ చేసే రిజర్వ్ స్థలాన్ని ఓ కౌన్సిలర్ తన కుమార్తె పేరుతో ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. భారీఎత్తున వ్యాపార సముదాయాలు నిర్మించి, అద్దెకు ఇచ్చుకున్నాడు.రిజర్వ్ స్థలంలో అక్రమ కట్టడాలను ఆపాలని అప్పటి అధికారులకు టీడీపీ నాయకులు వినతులు అందజేశారు. అయినా అధికారులు చర్యలు చేపట్టలేదు. అప్పటి అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గారన్న విమర్శలున్నాయి.
- ముదిగుబ్బ మండల కేంద్రం చుట్టూ జాతీయ రహదారి నిర్మాణం చేపడుతున్నారు. దీంతో భూముల విలువ అమాంతం పెరిగింది. ప్రస్తుతం అక్కడ ఎకరా రూ.2కోట్లుపైమాటే. దీంతో మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి అనుచరులు ముదిగుబ్బలో 30 ఎకరాలు ఆక్రమించారు.
- ముదిగుబ్బ సమీపాన దొరిగిల్లు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 2060-4లో మూడెకరాల భూమిని గత టీడీపీ హయాంలో ముస్లిం శ్మశాన వాటికకు కేటాయించారు. వైసీపీ అధికారం చేపట్టాక ఆ భూమిని ఆక్రమించి, ఆ పార్టీ మండల నాయకుడి పేరిట ఆన్‌లైన్‌లో ఎక్కించారు. జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఈ భూమి విలువ రూ.6కోట్లు పైమాటే. రెవెన్యూ అధికారులను బెదిరించి పాసు పుస్తకాలను సైతం చేయించుకున్నట్లు తెలుస్తోంది.
- ముదిగుబ్బ మండల కేంద్రానికి అనుకుని ఉన్న దొరిగిల్లు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 1330-1లోని 17 ఎకరాల గుట్టప్రాంతాన్ని వైసీపీ నాయకులు ఆక్రమించుకున్నారు. గుట్టను చదును చేసి, ప్లాట్లుగా మార్చి సెంటు రూ.2 లక్షల చొప్పున విక్రయించి సొమ్ము చేసుకున్నారు. తహసీల్దార్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా ఖాతరు చేయలేదు.
- ముదిగుబ్బలో జాతీయ రహదారి పక్కన గుంజేపల్లి రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 1190-3లో టీడీపీ హయాంలో పేదలకు ఇళ్ల పట్టాలిచ్చారు. అప్పట్లో కొంతమంది ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్నారు. ఇళ్లు కట్టుకోని వారిని వైసీపీ నేతలు బెదిరించి, స్థలాలను లాక్కున్నారు. దాదాపు 4 ఎకరాలు ఆక్రమించి, నిర్మాణాలు చేపట్టారు. కేజీబీవీకి ఆనుకుని ఉన్న స్టేడియానికి వెళ్లే దారిని ఆక్రమించి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. ఇక్కడ సెంటు రూ.2 లక్షలు ధర పలుకుతోంది.
- బత్తలపల్లిలోని ఆర్టీసీ బస్టాండు పక్కన 272-1బీ సర్వే నంబరులో 36 సెంట్ల స్థలం కబ్జా చేశారు.



ధర్మవరంలోని ఎల్‌సీకే పురంలో పుట్టపర్తి రహదారి పక్కన నిర్మించిన వ్యాపార సముదాయం



తుంపర్తి సమీపంలోని గుర్రాలకోట మ్యాప్ వ్యూ

వేరుశనగలో రసంపీల్చే పురుగును నివారించాలి

వ్యవసాయ శాస్త్రవేత్త జాన్సన్

కొత్త చెరువు, జూన్ 25: ఖరీఫ్‌లో రైతులు సాగుచేసిన వేరుశనగ పంటలో రసం పీల్చే పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ జాన్సన్.. రైతులకు సూచించారు. మండలంలోని తిరుమలదేవరపల్లి సమీపాన కేశవరెడ్డి సాగుచేసిన వేరుశనగ పంటను వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం పరిశీలించారు. శాస్త్రవేత్త జాన్సన్ మాట్లాడుతూ.. 15 నుంచి 50 రోజుల్లోపు వయసున్న వేరుశనగ పైరును రసం పీల్చే పురుగు ఆశిస్తుందన్నారు. దీని నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. మోనోక్రోటోపాస్ లీటరు నీటికి 1.6 ఎంఎల్‌గానీ, 1.5 గ్రాముల అస్ఫేట్‌ను కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. వేరుశనగ సాగుచేసే రైతులు తప్పని సరిగా క్లోప్రేడ్ 0.4 ఎంల్‌కు మ్యాంకో జబ్ మూడు గ్రాములు కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్త రామసుబ్బయ్య, ఏఓ నటరాజ్, రైతులు పాల్గొన్నారు.

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు



వైభవం.. ఖాద్రీశుడి వెండి ప్రాకారోత్సవం..



వెండిరథంలో ఊరేగుతున్న స్వామివారు

కదిరి, జూన్ 25: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీదేవీభూదేవి సమేత వసంతవల్లభుడి వెండిరథ ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. వెండిరథంపై కొలువుదీరిన స్వామి వారిని కదిరి మల్లెలు, తులసీమాలతో అలంకరించారు. ఆస్థాన పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాకారోత్సవం వైభవంగా సాగింది.



వెండిరథంపై శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారు

అంతా తూచ్..



గొల్లపల్లి రిజర్వాయర్‌లో లైఫ్‌బోట్ ద్వారా ఎన్డీఆర్ఎఫ్ మాక్‌డ్రిల్



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందాలు

పెనుకొండ మండలంలోని గొల్లపల్లి రిజర్వాయర్ వద్దకు మంగళవారం జాతీయ విపత్తుల రిస్క్ ఫోర్స్ (ఎన్డీఆర్ఎఫ్) దిగింది. లైఫ్ బోట్లతో రిజర్వాయర్‌లో కలియతిరిగింది. పెనుకొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ కూడా వచ్చారు. రిజర్వాయర్ కట్ట పైనుంచి ఎన్డీఆర్ఎఫ్ అధికారులు.. వారికి సూచనలిస్తున్నారు. దీంతో స్థానికులంతా రిజర్వాయర్‌లో ఎవరో పడ్డారని అక్కడికి చేరుకున్నారు. ఏం జరుగుతుందోనని ఉత్కంఠగా తిలకించారు. ఆఖరుకు ఎన్డీఆర్ఎఫ్ బృందం రిజర్వాయర్ నుంచి బయటకు వచ్చింది. తీరా ఆరాతీస్తే ఇది అవగాహన కార్యక్రమమేనని తేలింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. బెంగళూరు నుంచి వచ్చిన ఎన్డీఆర్ఎఫ్ బృందం వరదల సమయంలో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించింది. సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రదర్శించిన ధైర్యసాహసాలను స్థానికులు ప్రశంసించారు. కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, అగ్నిమాపక, వైద్యాధికారులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. -పెనుకొండ రూరల్

కీచక వైద్యుడు

> ఏఎన్ఎంలకు వేధింపులు
>
> ఫోన్లకు అసభ్య మెసేజ్‌లు
>
> జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు



ఫిర్యాదు చేసేందుకు వచ్చిన ఏఎన్ఎంలు

పుట్టపర్తి రూరల్/చెన్నేకొత్తపల్లి జూన్ 25: ఓ వైద్యుడు.. కీచకుడి అవతారమెత్తాడు. మహిళా ఉద్యోగుల పట్ల వక్రబుద్ధి చూపాడు. తన కోర్కెలు తీర్చాలంటూ పలువురు ఏఎన్ఎంలను ఫోన్ ద్వారా, వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా లైంగికంగా వేధిస్తున్న ఉదంతం మంగళవారం వెలుగులోకి వచ్చింది. వైద్యుడి వేధింపులపై బాధిత ఏఎన్ఎంలు.. జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేశారు. పుట్టపర్తిలోని జిల్లా వైద్యాధికారి కార్యాలయానికి వచ్చిన వారు గోడు వెల్లబోసుకున్నారు. చెన్నేకొత్తపల్లి మండలం ఎన్ ఎస్ గేట్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఉదయ్ తమను లైంగికంగా వేధిస్తున్నాడని ఆరోపించారు. అసభ్యకర మెసేజ్‌లు పెడుతున్నాడని వాపోయారు. తనమాట వినకుంటే విధుల నుంచి తొలగిస్తానని బెదిరిస్తున్నాడన్నారు. తమతోపాటు తమ పిల్లలను కూడా లైంగికంగా వేధిస్తున్నాడని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు.

విచారణ చేయిస్తాం: డాక్టర్ మంజువాణి, జిల్లా వైద్యాధికారి

వైద్యాధికారిపై ఏఎన్ఎంలు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఐదుగురు సభ్యులతో కమిటీ వేసి, విచారణ చేపడతాం. వేధింపులు వాస్తవమని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

విధులకు ఆటంకం కలిగించిన కేసులో ఏడాది జైలు

మడకశిర టౌన్, జూన్ 25: పంచాయతీ కార్యదర్శి విధులకు ఆటంకం కలిగించిన కేసులో మండలంలోని వై.బి. హళ్లి గ్రామానికి చెందిన రామాంజినప్పకు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ మడకశిర జూనియర్ సివిల్ న్యాయాధికారి అశోక్‌కుమార్ మంగళవారం తీర్పు వెలువరించారు. రామాంజినప్ప 2020లో పంచాయతీలో గ్రీన్ అంబాసిడర్‌గా పనిచేస్తుండేవాడు. విధులకు సరిగా హాజరుకాకపోవడంతో అతడిని తొలగిస్తారని అప్పట్లో ప్రచారం సాగిందని సమాచారం. దీంతో అప్పటి వై.బి. హళ్లి పంచాయతీ కార్యదర్శిగా పెద్దన్న వద్దకెళ్లి వాగ్వాదానికి దిగాడు. ఇతర అధికారులతోనూ దురుసుగా ప్రవర్తించాడు. దీంతో విధులకు ఆటంకం కలిగించినట్లు పంచాయతీ కార్యదర్శి.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయాధికారి శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు.

మీ పిల్లలకూ మాడిన అన్నం పెడతారా?

హెచ్ఎంపై డీఈఓ ఆగ్రహం

మెనూ పాటించకపోవడంతో మండిపాటు




మాడిన అన్నాన్ని చూపుతున్న డీఈఓ

హిందూపురం అర్బన్, జూన్ 25: 'మీ పిల్లలకైతే మాడిపోయిన అన్నం పెడతారా' అని జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మీనాక్షి.. స్థానిక ఎంజీఎం పాఠశాల హెచ్ఎం సామ్రాజ్యాన్ని ప్రశ్నించారు. పాఠశాలను మధ్యాహ్న భోజన విభాగ ఏడీ రామకృష్ణతో కలిసి డీఈఓ మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. 337 మంది విద్యార్థులు హాజరు కాగా.. ఇంకా పలువురు పిల్లలు భోజనం చేయాల్సి ఉంది. అప్పుడే అన్నం అయిపోయింది. పాత్రలో ఉన్న కాస్త అన్నాన్ని గీకి.. గీకి.. పెడుతుండడాన్ని డీఈఓ గమనించారు. మాడిన అన్నం పిల్లలకు పెడతారా అని ఆగ్రహించారు. జిల్లా అధికారులు వస్తున్నారనీ, మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలిస్తారని తెలిసీ అన్నం తక్కువగా వండడం, అది కూడా అయిపోయేలా చేయడం ఏంటని మండిపడ్డారు. ప్రతి పాఠశాలకు కొత్త వంట పాత్రలు ఇచ్చామనీ, వాటిలో ఎందుకు వండలేదని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వహకుడిని అడిగారు. ఆ పాత్రలు తనకు హెచ్ఎం ఇవ్వలేదని అతడు సమాధానమిచ్చాడు. కొత్త పాత్రలు ఎందుకివ్వలేదని హెచ్ఎం సామ్రాజ్యంపై డీఈఓ ఆగ్రహించారు. కొత్త మెనూ ప్రకారం భోజనం పెట్టాల్సింది పోయి.. పాత మెనూనే కొనసాగిస్తున్నారేంటని ఏడీ రామకృష్ణ ప్రశ్నించారు. కొత్త మెనూ తమకు రాలేదని హెచ్ఎం చెప్పడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త మెనూను పంపిన మెసేజ్ చూపి, ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అని మండిపడ్డారు. ఈ ఏడాది మార్చి 22న పాఠశాల విద్యార్థులకు సరఫరా చేసిన బూట్లను మార్కెట్‌లో అమ్మేసినట్లు ఫిర్యాదులు అందడంతో విచారణకు వచ్చామని డీఈఓ మీనాక్షి తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆమె వెల్లడించారు.



పాత పాత్రల్లో ఎందుకు వండుతున్నారని ప్రశ్నిస్తున్న డీఈఓ

కొలువుల పండుగ



- డీఎస్సీ దిశగా వడివడిగా అడుగులు
- ఉమ్మడి జిల్లాలో 811 పోస్టుల భర్తీ...?
- స్కూల్ అసిస్టెంట్ 628, ఎస్‌జీటీ 183
- ఐదేళ్ల నైరాశ్యానికి తెరదించిన చంద్రబాబు
- దుమ్ము దులుపుకుంటున్న కోచింగ్ సెంటర్లు
- ఉరిమే ఉత్సాహంతో సిద్ధమవుతున్న అభ్యర్థులు

అనంతపురం విద్య, జూన్ 25: లక్షలాది మంది నిరుద్యోగులు ఆశగా ఎదురు చూసిన పండుగ రానే వచ్చింది. కొలువుల జాతర సిద్ధమవుతోంది. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకుంటున్నారు. బాధ్యతలు తీసుకున్న రోజునే మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. కూటమి ప్రభుత్వ కేబినెట్ తొలిసారి భేటీలోనే ఆమోదం తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 16వేల పైచిలుకు పోస్టుల భర్తీకి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 811 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో 628 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 183 సెకెండరీ గ్రేడ్ టీచర్ పోస్టులు ఉన్నాయి. డీఎస్సీ నేపథ్యంలో ఇన్నాళ్లూ మూతబడిన కోచింగ్ కేంద్రాలు దుమ్ము దులుపుకుంటున్నాయి. ఐదేళ్లపాటు తీవ్ర నైరాశ్యంలో ఉన్న నిరుద్యోగులు పోటీ పరీక్షకు ఉత్సాహంగా సిద్ధమవుతున్నారు.


డీఎస్సీకి శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

జిల్లాలో ఖాళీలు ఇవే..?

వైసీపీ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో 386 ఖాళీగా ఉన్నాయి. మొదట్లో ఎస్‌జీటీ పోస్టులు నాలుగు మాత్రమే చూపారు. దీంతో ఆగ్రహించిన నిరుద్యోగులు రోడ్లపైకి వచ్చారు. దీంతో అప్పటి జగన్ ప్రభుత్వం అరకొరగా పెంచింది. అయినా నిరుద్యోగుల్లో ఆనందం కనిపించలేదు. చంద్రబాబు అధికారం చేపట్టగానే భారీగా పోస్టుల భర్తీకి నడుం బిగించారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 వేలపైచిలుకు పోస్టులు భర్తీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 811 పోస్టులు భర్తీ చేస్తారని విస్వసనీయంగా తెలిసింది. ఇందులో స్కూల్ అసిస్టెంట్స్ కేటగిరీల వారీగా చూస్తే...

కేటగిరీ	పోస్టుల సంఖ్య
ఎస్‌ఏ-(తెలుగు)	45
ఎస్‌ఏ- హిందీ	35
ఎస్‌ఏ- ఇంగ్లీష్	103
ఎస్‌ఏ-గణితం	44
ఎస్‌ఏ-పీఎస్	68
ఎస్‌ఏ-బీఎస్	73
ఎస్‌ఏ-సోషల్	112
ఎస్‌ఏ-ఫిజికల్	
ఎడ్యుకేషన్	148
ఎస్‌జీటీ	183
----------	------
మొత్తం	811
----------	-------

ఇదే కదా ఆనందం..



2019 నుంచి డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాను. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎస్‌ఏ-సోషల్ 5 పోస్టులు మాత్రమే ఇచ్చారు. తక్కువ పోస్టులను చూసి చాలా బాధేసింది. నిరాశ చెందాను. చంద్రబాబు మెగా డీఎస్సీ ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులు పెద్ద సంఖ్యలో భర్తీ చేస్తుండటంతో ఆనందంగా ఉంది. జాబ్ సాధిస్తానన్న నమ్మకం పెరిగింది.

- అభిషేక్, డీఎస్సీ అభ్యర్థి, అనంతపురం

నా కల నిజం అవుతుంది..



బీఈడీ పూర్తి టీచర్ ఉద్యోగాల కోసం కొన్నేళ్లగా ఎదురుచూస్తున్నాను. నోటిఫికేషన్లు రాకపోవడంతో ప్రైవేట్ స్కూళ్లలో టీచర్‌గా పనిచేస్తున్నాను. ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే ఆశయం కలగా మిగిలిపోతుందేమో అని బాధపడిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కొత్తగా వచ్చిన ప్రభుత్వం టీచర్ పోస్టుల భర్తీకి వేగంగా చర్యలు తీసుకుంటోంది. ఈ మెగా డీఎస్సీలో కచ్చితంగా పోస్టు సాధిస్తానన్న విశ్వాసం కలుగుతోంది. నా కల నిజమవుతుందని బలంగా నమ్ముతున్నాను. పేద విద్యార్థులకు సేవ చేసే అవకాశం వస్తుందని ఆశిస్తున్నాను.

-రమ్య, డీఎస్సీ అభ్యర్థి, గుత్తి

ఐదేళ్ల నైరాశ్యం నుంచి..

మోడువారిన ఆశల మోసులకు చంద్రబాబు నీరు పోసి.. చిగురింపజేశారు. కొలువు కొట్టాల ఆశతో నిరుద్యోగులు ఐదేళ్లు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూశారు. 2019లో సీఎం పీఠమెక్కిన జగన్.. నిరుద్యోగులను నిలువునా ముంచారు. వారిని ఏమాత్రం పట్టించుకోలేదు. అదిగో ఇదిగో అంటూ ఊరించి.. ఎన్నికల సమయంలో డీఎస్సీ అంటూ మోసగించాలని చూశారు. కానీ నిరుద్యోగులు నమ్మలేదు. 2024 జూన్ 3వ తేదీ వరకూ నిరుద్యోగులు నైరాశ్యంలోనే ఉన్నారు. ఆ మరుసటి రోజు ఎన్నికల ఫలితాలు రాగానే ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.

పోస్టులు పెరిగే చాన్స్

జగన్ ప్రభుత్వం 117 జీవో తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలలను నాశనం చేసింది. వేలాది ఎస్‌జీటీ పోస్టులను రద్దు చేసింది. టీడీపీ కూటమి ప్రభుత్వం ఆ తప్పులను సరిదిద్దుతుందని, తమ సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని ఉపాధ్యాయులు భావిస్తున్నారు. ఈ క్రమంలో 117 జీవో రద్దు చేయాలని ఇప్పటికే పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు, విద్యాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నారు. 117 జీవోను రద్దు చేస్తే ఎస్‌జీటీ పోస్టులు పెరుగుతాయని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు.

మళ్లీ మంచి రోజులు

జగన్ దెబ్బకు జిల్లాలో పలు కోచింగ్ కేంద్రాలు మూతపడ్డాయి. నిపుణులైన నిరుద్యోగులు కోచింగ్ కేంద్రాలు పెట్టుకుని ఉపాధి పొందేవారు. గతంలో ఏ ప్రభుత్వం వచ్చినా, అడపా దడపా పోస్టులు భర్తీ చేసేవారు. దీంతో పోటీ పరీక్షలకు కోచింగ్ ఇస్తూ జీవనం గడిపేవారు. ముఖ్యంగా డీఎస్సీ కోచింగ్‌కు అధిక ప్రాధాన్యం ఉండేది. వేలాది మంది శిక్షణకు రావడమే దీనికి కారణం. జిల్లాలో ఉన్న పేరు మోసిన కోచింగ్ సెంటర్లతోపాటు చిన్న తరహా కోచింగ్ కేంద్రాలు సుమారు 15 వరకూ నడిచేవి. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చాక వారికి గడ్డుకాలం మొదలైంది. డీఎస్సీ లేదు, జాబ్ క్యాలెండ్ లేదు. ఒకప్పుడు కిటకిటలాడిన కేంద్రాలు మూతపడ్డాయి. ఏడాదికి రూ.50 లక్షలు, రూ.70 లక్షల నుంచి రూ.కోటి వరకూ సాగే బిజినెస్ కోల్పోయారు. కొందరు నిర్వాహకులు అప్పులపాలయ్యామని వాపోతున్నారు. జగన్ ప్రభుత్వ వైఖరి వల్ల జిల్లాలో సుమారు ఆరు శిక్షణా కేంద్రాలు మూసేశారు. లక్షలాది రూపాయల అద్దె చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చంద్రబాబు సీఎం కావడంతో తమకు మళ్లీ మంచి రోజులు వచ్చాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చంద్రబాబు రాకతోనే..



జగన్ ప్రభుత్వం ఐదేళ్లూ అందరినీ ముంచేసింది. నిరుద్యోగులను భయాందోళనలకు గురిచేసింది. జగన్ వారిలో అభద్రతాభావాన్ని పెంచారు. డీఎస్సీ ప్రకటనపై రోజుకొక మాట చెబుతూ మాయలు చేశాడు. ఆఖరికి కోచింగ్ సెంటర్లు కూడా మూత పడేలా చేశారు. లక్షలాది మంది నిరుద్యోగుల ఆశలను ఆవిరి చేశారు. ఎన్నికల ముందు లక్షలాది మంది నిరుద్యోగులకు చంద్రబాబు మాట ఇచ్చారు. అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీ ఫైల్‌పై తొలి సంతకం చేశారు. దీంతో నిరుద్యోగులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

- గుత్తా ధనుంజయనాయుడు, టీఎన్ఎస్ఎఫ్, జిల్లా అధ్యక్షుడు

అభ్యర్థుల్లో ఆనందం..



గత ఐదేళ్లలో డీఎస్సీ ప్రకటన లేక వేలాది మంది అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. చంద్రబాబు ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటన ఇవ్వడంతో నిరుద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 వేల పైచిలుకు పోస్టుల భర్తీకి శ్రీకారం చుట్టారు. కేబినెట్‌లో కూడా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం.. పోస్టులు రెట్టింపు కావడంతో డీఎస్సీ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

- తేజ, తేజ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు

కసాపురం ఆలయ హుండీ ఆదాయం రూ. 81.27లక్షలు

గుంతకల్లుటౌన్,జూన్25: కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం హుండీల లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఈఓ భద్రాజీ ఆధ్వర్యంలో 89 రోజులకు గాను హుండీలను లెక్కించారు. రూ.81,27,202, అన్నప్రసాదం వితరణ హుండీ రూ. 74,790, 11.500గ్రాముల బంగారం, 2.800కేజీ వెండి, విదేశీ కరెన్సీలు వచ్చాయని ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ మల్లికార్జున, జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆంధ్రప్రగతి బ్యాంక్ సిబ్బంది, పోలీస్, ఆర్టీసీ సేవాసమితి, వీరభద్ర సేవాసమితి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.


హుండీ సొమ్మును లెక్కిస్తున్న సేవాసమితి సభ్యులు

8 నుంచి ఏఐఎస్ఎఫ్ శిక్షణాతరగతులు

అనంతపురం విద్య, జూన్ 25 : ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర శిక్షణా తరగతులు జూలై 8వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాన్సన్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతుల పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 8,9,10 తేదీల్లో కాకినాడలో రాష్ట్ర శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థుల్లో చైతన్యం నింపడానికి విద్యార్థులకు తరగతులు ఉపయోగపడుతాయన్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణయ్య, జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నేతలు హనుమంతు, నరసింహ, వెంకట్, ఆంజినేయులు, వంశీ పాల్గొన్నారు.


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నేడు మంత్రి సవిత రాక

పెనుకొండ టౌన్, జూన్ 25 : రాష్ట్ర బీసీ సంక్షేమం, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత బుధవారం శ్రీ సత్యసాయి జిల్లాకు రానున్నట్లు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. ఆమె మంగళవారం రాత్రి 8గంటలకు విజయవాడలో బయలుదేరి 10.30 గంటలకు బెంగళూరు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన పెనుకొండలోని స్వగృహానికి చేరుకుంటారు. అనంతరం ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.

పాఠశాల వాహనానికి ప్రమాదం

- తృటిలో తప్పించుకున్న 25 మంది విద్యార్థులు

బొమ్మనహాళ్, జూన్ 25: మండలంలోని ఉంతకల్లు గ్రామ సమీపంలో విద్యార్థులకు పెనుప్రమాదం తప్పింది. ఒక ప్రైవేట్ పాఠశాల వాహనం పంట కాలువలోకి దూసుకెళ్లడంతో విద్యార్థులు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. ఉంతకల్లు గ్రామానికి విద్యార్థులు ఆరు కిలోమీటర్ల దూరంలో ఉండే ఉద్దేహాళ్ గ్రామంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. వీరిని పాఠశాలకు చెందిన వాహనం రోజు పాఠశాలకు తీసుకువచ్చి, వదిలేది. ఈక్రమంలోనే మంగళవారం కూడా పాఠశాలకు చెందిన కేఏ 36 బి 4237 నంబర్ గల వాహనం విద్యార్థులను తీసుకువచ్చింది. స్కూల్ ముగిసిన తర్వాత సాయంత్రం పిల్లలను వదిలి వెళ్లడానికి బయల్దేరింది. డ్రైవర్ వాహనాన్ని అజాగ్రత్తతో వేగంగా నడపడంతో పంటకాలువలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ వాహనాన్ని వదిలేసి పరారయ్యాడని స్థానికులు తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో దాదాపు 25 మంది విద్యార్థులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. అయితే ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రైవేట్ పాఠశాలకు చెందిన వాహనం ప్రమాదానికి గురికావడం ఇది రెండోసారని, గతంలో కొళగానహళ్లి వద్ద కూడా ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు.



పంట కాలువలోకి దూసుకెళ్లిన వాహనం

ఆధునికీకరణ సాగేనా..?



- ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగని హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు
- సాగునీటి ప్రాజెక్టులపై నిండా నిర్లక్ష్యం
- రైతుల ఆశలన్నీ టీడీపీ ప్రభుత్వంపైనే..
- మరమ్మతులతో అడుగడుగునా అడ్డు
- చివరి ఆయకట్టు భూములకు పారని నీరు



14వ కి.మీ. అక్విడెక్ట్‌పై పడిన రంధ్రం


హెచ్చెల్సీలో పెరిగిన పిచ్చి మొక్కలు, పూడిక

ఉరవకొండ, జూన్ 25: ఐదేళ్ల వైసీపీ పాలనలో సాగునీటిపై నిండా నిర్లక్ష్యమే నెలకొంది. కొత్తగా ఏర్పడిన టీడీపీ ప్రభుత్వంలోనైనా సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగేనా అని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. వైసీపీ పాలనలో హెచ్చెల్సీ, జీబీసీ పనులు కాసింతైనా ముందుకు కదలలేదు. కనీసం తట్టెడు మట్టికూడా తీయలేకపోయారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అన్న చందంగా తయారయ్యాయి. కాలువ గట్లు భారీగా కోతకు గురయ్యాయి. కాలువల్లో పూడిక పెరిగిపోవడంతో నీరు ముందుకు పారడమే ప్రశ్నార్థకంగా తయారయ్యింది. కాలువల్లో పిచ్చిమొక్కలు, గుర్రపుడెక్క, పెరిగిపోయాయి. హెచ్చెల్సీ 6వ ప్యాకేజీలో 183వ కి.మీ నుంచి 189కి.మీ వరకు పనులు నిలిచిపోయాయి. ఇంద్రావతి డీప్ కట్ వద్ద ఆధునికీకరణ పనులు చేపట్టలేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తుంగభద్ర ఎగువ కాలువ గట్టు కోతకు గురయ్యింది. నింబగల్లు ఎగువ ప్రాంతాల్లో వర్షం కారణంగా వరదనీరు, వర్షపునీరు కాలువగట్లు మట్టి కొట్టుకు రావడంతో నీటి ప్రవాహానికి అడ్డంగా మారింది.

షెట్టర్ల పరిస్థితి ఘోరం

ఇక హెచ్చెల్సీ కాలువ షెట్టర్ల పరిస్థితి కూడా ఘోరంగా తయారయ్యింది. షెట్టర్లకు ఉన్న రాళ్లు ఊడిపోయి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఆధునికీకరణ పనుల్లో వీటి నిర్మించాల్సి ఉంది. కనీసం తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టలేదు. మరమ్మతుల కోసం రూ.48లక్షలతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. తాత్కాలిక మరమ్మతులు చేస్తే నీరు పారే అవకాశముంది. ఇంద్రావతి వద్ద డీప్‌కట్‌లో అడ్డంగా పెద్ద పెద్ద బండరాళ్లు ఉన్నాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని షెట్టర్లను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.


కూలడానికి సిద్ధంగా ఉన్న హెచ్చెల్సీ షెట్టర్లు


14వ కి.మీ. వద్ద జీబీసీ దుస్థితి

అడుగడుగునా అవాంతరాలే..

గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ) కింద చివరి ఆయకట్టు భూములకు సాగునీరు అందడం ప్రశ్నార్థకంగా మారింది. ప్రధాన కాలువలో అక్విడెక్టులు, అండర్ టన్నెళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటికి మరమ్మతులు మరిచారు. దీంతో నీరు అంతా వృథాగా పోతోంది. ప్రధాన కాలువ పొడవు 59.5 కిలో మీటర్లు కాగా గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద 15,800 ఎకరాల ఆయకట్టు ఉంది. 2017 గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ ఆధునికీకరణ పనులను చేపట్టారు. ఫేజ్-1 కింద 1కి.మీ నుంచి 28 కి.మీ వరకూ రూ.120 కోట్లతో పనులను చేపట్టారు. కాలువ లైనింగ్ పనులను మాత్రమే చేశారు. డిస్ట్రిబ్యూటర్లు ప్రధానకాలువ కంటే ఎత్తులో ఉండటంతో వాటికి అడ్డుకట్ట వేస్తే కానీ నీరు వెళ్లని పరిస్థితులున్నాయి. అక్విడెక్టులు అండర్ టన్నెల్ పనులను విస్మరించారు. 28వ కి.మీ నుంచి 59.5కి.మీ వరకూ రూ.117.2కోట్లతో పనులు చేపట్టేందుకు నిధులు కేటాయించారు. పనులు సగంలోనే నిలిచిపోయి నాలుగేళ్లు అవుతుంది. 15వ కి.మీ అక్విడెక్ట్‌కు రంధ్రాలు ఏర్పడి నీటి సరఫరాకు అవాంతరం ఏర్పడింది. కాలువలో పిచ్చిమొక్కలు, పూడిక పేరుకు పోయింది. దీంతో నీటి ప్రవాహానికి ఆటంకాలు కలుగుతున్నాయి. ఛాయాపురం నుంచి చివరి వరకూ ప్రధానకాలువలో పిచ్చిమొక్కలు రబ్బరు చెట్లు పెరిగాయి. తిమ్మాపురం అంచనహాల్ గ్రామాల వద్ద కూడా కాలువ లైనింగ్ దెబ్బతినింది. జీబీసీకి అరకొరగానే నీటి కేటాయింపులు. జీబీసీ, జీఎస్‌బీసీ, ఏబీసీ కాలువకు 6.89 టీఎంసీల నీరు ఇవ్వాల్సి ఉండగా జీబీసీ పనులు జరగకపోవడంతో నీటి కేటాయింపులు కూడా తగ్గుతున్నాయి.

సాగునీటి ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలి

- మనోహర్, ఏపీ రైతు సంఘం ప్రధానకార్యదర్శి



ఆగిపోయిన సాగునీటి ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలి. ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం సాగు నీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసింది. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు నిలిచిపోవడంతో కాలువ అధ్వానంగా తయారైంది. కాలువ గట్లు కోతకు గురయ్యాయి. రైతులు పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో పిచ్చిమొక్కలు పెరిగి నీరు పారేది గగనంగా తయారైంది.

మోటార్లతో నీటిని వదులుకోవాల్సి వస్తోంది

- గోవిందరాజు, రైతు, ఉండబండ



డిస్ట్రిబ్యూటరిలోని తూములకు నీళ్లు అందక మోటర్లతో పంపు చేసుకుని, సాగుకు వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. తూము ఎత్తులో ఉండడంతో నీరు అందడం లేదు. కాలువలో రాళ్లను అడ్డువేసుకుని తూములకు మళ్లించుకోవాల్సి వస్తోంది. ఆధునికీకరణ పనులు చేపట్టినా ఏం ప్రయోజనం లేదు.

చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు

- లింగప్ప, రైతు, డొనేకల్లు



జీబీసీ కాలువ పరిధిలో చివరి ఆయకట్టు భూములకు నీరు అందడం లేదు. ఆయకట్టు భూములను బీడుగా వదులుకోవాల్సి వస్తోంది. జీబీసీ ఫేస్-2 క్రింద ఆధునీకరణ పనులు నిలిచిపోయాయి. వెంటనే పనులు పూర్తి చేయాలి. కొత్త ప్రభుత్వమైనా సాగు నీటి ప్రాజెక్టులపైన శ్రద్ధ చూపాలి. చివరి ఆయకట్టుకు నీరందించి రైతును ఆదుకోవాలి.

రాష్ట్రస్థాయి పోటీలకు కొడిగెనహళ్ళి విద్యార్థులు

హిందూపురం అర్బన్, జూన్ 25: రాష్ట్రస్థాయి పారా అథ్లెటిక్స్ పోటీలకు కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మురళిధర్‌బాబు తెలిపారు. అనంతపురంలోని నీలం సంజీవరెడ్డి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కొడిగెనహళ్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఇందులో ఎనిమిదో తరగతి విద్యార్థి రితీష్‌కుమార్ వంద మీటర్ల పరుగుపందెంలో మొదటి స్థానం, ఏడో తరగతి విద్యార్థి సాంబశివ లాంగ్ జంప్‌లో ప్రథమ స్థానం దక్కించుకున్నారన్నారు. విద్యార్థులు త్వరలో వైజాగ్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్, పిఈటీ షబానాబాను, ఉపాధ్యాయులు అభినందించారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

చీనీకాయలు టన్ను రూ.31 వేలు

అనంతపురంరూరల్, జూన్ 25: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.31 వేలు, కనిష్ఠంగా రూ.10 వేలు, సరాసరి రూ.20 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మొత్తం 704 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

సంక్షేమ హాస్టళ్లలో సమస్యల తిష్ట

- వినియోగించడానికి వీలులేకుండా మరుగుదొడ్లు, స్నానపుగదులు
- గదులకు కిటికీలు, తలుపులు లేని వైనం
- పనిచేయని ఫ్యాన్లు
- మెనూ ప్రకారం అందని భోజనం
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని వార్డెన్లు, అధికారులు



నల్లమాడలోని హాస్టల్‌లో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



రెడ్డిపల్లి హాస్టల్‌లో నిరుపయోగంగా అదనపు గదులు

నల్లమాడ, జూన్ 25: మండలంలోని ప్రభుత్వ బాలుర సంక్షేమ వసతి గృహాల్లో పలు సమస్యలు తిష్ట వేశాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంలో బీసీ బాలుర, రెడ్డిపల్లిలో బీసీ బాలుర, ఎర్రవంక పల్లిలో ఎస్టీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. వాటిల్లో దాదాపు 130మంది విద్యార్థులు చదువులు కొనసాగిస్తున్నారు. ఇటీవల పాఠశాలలు పునఃప్రారంభమవడంతో విద్యార్థులు హాస్టళ్లకు చేరుకుంటున్నారు. వసతిగృహాల్లో స్నానపు గదులు, మరుగుదొడ్లు ఉపయోగంలో లేవు. నీటి సౌకర్యం ఉన్నా.. కొళాయిలు పని చేయడం లేదు. అలాగే తలుపులు లేవు. అంతేకాకుండా శుభ్రం చేయకపోవడంలో అవి కంపు కొడుతున్నాయి. దీంతో విద్యార్థులు వాటిని వినియోగించలేకపోతున్నారు. హాస్టళ్లలోని గదుల్లో ఫ్యాన్లు సరిగా పని చేయడం లేదు. కొన్ని గదులకు కిటికీలు, తలుపులు కూడా సక్రమంగా లేవు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో, దోమలు బెడద అధికంగా ఉంది. విద్యార్థులు దోమకాటుకు గురై, అనారోగ్యం బారిన పడే అవకాశాలున్నాయి. ఆ హాస్టళ్ల భవనాలు కూడా శిథిలావస్థకు చేరాయి. రెడ్డి పల్లి హాస్టల్లో ఆరు అదనపు గదులు నిర్మించినా.. ఏ కారణం చేతనో అవి ఉపయోగంలో లేవు. ఇన్ని సమస్యలున్నా వార్డెన్లు ఏమీ పట్టనట్లు వ్యవహస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సెలవులు పూర్తయ్యాక విద్యార్థులు హాస్టళ్లకు వస్తున్నారు. వారికి అన్నీ సమస్యలే ఎదురవుతున్నాయి. ఇక వసతి గృహాల్లో మెనూ ప్రకారం కూడా విద్యార్థులకు భోజనం అందడం లేదని తెలుస్తోంది. గతంలో టీడీపీ పాలనలో హాస్టళ్లలోని విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు, దుప్పట్లు పంపిణీ చేసేవారని, గత ఐదేళ్ల వైసీపీ పాలనలో దుప్పట్లు మాత్రమే అందించారని, మిగిలిన వాటిని అందించలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. నూతన ప్రభుత్వమైనా విద్యార్థులకు అవసరమైన వస్తువులన్నీ అందించాలని, అధికారులు వసతి గృహాలను పర్యవేక్షించి, విద్యార్థులకు సౌకర్యాలను మెరుగుపరచాలని వారు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరుకున్న రెడ్డిపల్లి వసతి గృహం

వసతులు కల్పించాలి



మండలంలో మూడు వసతి గృహాలున్నాయి. వీటిల్లో మరుగుదొడ్లు, స్నానపు గదులు ఉపయోగంలో లేవు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. గదుల్లో ఫ్యాన్లు సరిగా పని చేయడం లేదు. ఇన్ని సమస్యల మధ్యన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వసతిగృహాల్లో సౌకర్యాలు మెరుగు పరచాలి. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తాం.

– కుచ్చెపు చంద్ర, సీపీఐ మండల కన్వీనర్

మద్యం విక్రేత అరెస్టు

గాండ్లపెంట, జూన్ 25: మండలంలోని కటారుపల్లిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహబూబ్‌ఖాన్‌ను అరెస్టు చేసి, అతని వద్దనుంచి 8 క్వార్టర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ కృష్ణవేణి తెలిపారు. కటారుపల్లిలో ఇంటిలో మద్యంను విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం తనిఖీలు చేశామని, మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయని, వెంటనే వాటిని స్వాధీనం చేసుకుని, విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన



కమ్మవారిపల్లి వద్ద మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

నల్లచెరువు, జూన్ 25: మండలంలోని కమ్మవారి పల్లి, దేవరింటిపల్లి గ్రామాల్లోని పంటపొలాలను ఏడీఏ సత్యనారాయణ మంగళవారం పరిశీలించారు. ఇక్కడ అధికంగా మొక్కజొన్న సాగు చేయడంతో ఆ పంట సాగు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి భారతికి, సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

రామాలయానికి విరాళం

నల్లచెరువు, జూన్ 25: మండలకేంద్రంలో రామాలయ నిర్మాణానికి స్థానికుడైన పులి నారాయణ మంగళవారం రూ.ఐదువేలు విరాళం అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు కెసి వెంకటనారాయణ, వేమయ్య తెలిపారు. స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న పులి నారాయణ ఆలయ నిర్మాణానికి సహకారించిందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

28న ఎడ్లబండ్ల పోటీలు

కొత్తచెరువు, జూన్ 25: మండలంలోని గుంటిపల్లి సమీపంలో ఎడ్లబండ్ల పోటీలను ఈనెల 28వ తేదీన నిర్వహించనున్నట్లు కొత్తచెరువుకు నవీన్‌కుమార్, సాయికుమార్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. పాల్గొనే ఎడ్ల బండ్ల యజమానులు 27వతేదీలోగా ఎంట్రీఫీజు రూ.1000 చెల్లించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతికింద రూ.20వేలు, ద్వితీయ బహుమతి కింద రూ.15వేలు, తృతీయ బహుమతికింద రూ.10వేలు, నాలుగో బహుమతి కింద రూ.5వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ఆధ్వర్యంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. పేర్లు నమోదు చేసుకునేవారు 9949311056, 9703990527 నంబర్లలో సంప్రదించాలన్నారు.

జగన్ ఫొటో తొలగింపు



సచివాలయానికి జగన్ ఫొటోను తొలగించిన దృశ్యం

బుక్కపట్నం, జూన్ 25: వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం వచ్చినా.. మండలకేంద్రంలోని సచివాలయం-1 భవనానికి మాజీ సీఎం వైఎస్ జగన్ ఫొటోను అలాగే ఉంచడంపై మంగళవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు వెంటనే ఆ సచివాలయ భవనానికి ఉన్న జగన్ ఫొటోను తొలగింపజేశారు.

సచివాలయంలో పనిచేయని ప్రింటర్

- సర్టిఫికెట్ల కోసం ఇబ్బంది పడుతున్న ప్రజలు

గాండ్లపెంట, జూన్ 25: మండలకేంద్రంలోని సచివాలయంలో వారం రోజులుగా ప్రింటర్ పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కులం, ఆదాయం, ఆధార్, వన్‌బీలు తదితర వాటికోసం సచివాలయానికి వెళితే.. అక్కడ ప్రింటర్ పని చేయడం లేదని సిబ్బంది చెబుతున్నట్లు ప్రజలు వాపోతున్నారు. గత వారం రోజులుగా ప్రింటర్ పనిచేయడం లేదని, సమీపంలోని సోమయాజుల పల్లి సచివాలయానికి వెళ్లాలని డిజిటల్ అసిస్టెంట్ సలహా ఇస్తున్నారన్నారని చెబుతున్నారు. సోమయాజులపల్లి దాదాపు మూడు కిలోమీటర్ల దూరంలో ఉందని, వృద్ధులు, మహిళలు ఎలా వెళతారని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఇక్కడి సచివాలయంలో ప్రింటర్‌ను వెంటనే బాగు చేయించి ఇబ్బందులు లేకుండా చూడాలని వారు కోరుతున్నారు.

జాతీయ రహదారుల పనులను వేగవంతం చేయాలి: జేసీ

పుట్టపర్తి, జూన్ 25: జిల్లాలోని జాతీయ రహదారుల నిర్మాణపనులు వేగవంతం చేయాలంటూ జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుక్కపట్నం, పుట్టపర్తి మండలాల పరిధిలో జరుగుతున్న జాతీయ రహదారుల నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లకు భూములు కోల్పోతున్న రైతుల ఆధార్, బ్యాంకు వివరాలను సేకరించాలని, రైతుల పేర్లు, సర్వే నంబరు, విస్తీర్ణం పరిహారమొత్తంతో కూడిన జాబితాను సిద్ధం చేయాలంటూ అధికారులకు తెలిపారు. ప్రతిరైతుకు పరిహారం అందాలని, అందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తర్వాత ఓడీసీ మండలం గాజుకుంటపల్లి వద్ద జాతీయ రహదారి నిర్మాణపనులను పరిశీలించారు. జేసీ వెంట ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్లు తదితరులు ఉన్నారు.



వడ్డివారిపల్లి వద్ద గోడౌన్‌ను తనిఖీ చేస్తున్న జేసీ అభిషేక్ కుమార్

గోడౌన్‌లను పరిశుభ్రంగా ఉంచండి..

ఓబుళదేవరచెరువు: బియ్యం గోడౌన్‌లను, పెట్రోల్ బంక్ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని వడ్డివారిపల్లి వద్ద ఉన్న ప్రభుత్వ బియ్యం గోడౌన్‌ను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. గోడౌన్ పైభాగం దెబ్బ తినిందా.. లేదా.. అని, అలాగే పరిశుభ్రంగా ఉంచారా ..లేదా.. అని పరిశీలించారు. గిడ్డంగిని ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అక్కడి సిబ్బందికి సూచించారు. నిలువ ఉన్న బియ్యం స్టాక్‌ను పరిశీలించారు. అలాగే పౌర సరఫరాలకు సంబంధించిన పెట్రోల్ బంక్‌ను పరిశీలించి, సిబ్బందితో రోజువారీ లావాదేవీలను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు ఇనగలూరి వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో భాగ్యరేఖ, తహసీల్దార్ ఖాజీబీ, సీఎస్‌డీటీ రమాదేవి, ఆర్‌ఐ నాగేంద్ర తదితరులు ఉన్నారు.

ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయండి: ఎమ్మార్పీఎస్

ధర్మవరం, జూన్ 25: తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్‌లో జూలై 7వ తేదీన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందక్రిష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరిగే మాదిగల ఆత్మగౌరవ కవాతును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బూదెప్ప, నాయకులు తాడిమర్రి రామాంజనేయులు, గజ్జల రామాంజనేయులు పిలుపునిచ్చారు. మాదిగల ఆత్మగౌరవ కవాతు ను జయప్రదం చేసే కార్యక్రమంలో భాగంగా మంగళవారం వారు పల్లె బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ జరిగితేనే మాదిగల జీవితాల్లో మార్పు వస్తుందన్నారు. మాదిగలకు విద్య, ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయన్నారు. మాదిగల ఆత్మగౌరవ కవా తును విజయవంతానికి ప్రతిఒక్కరూ తరలిరావాలని కోరారు. నాయకులు చిల్లవారిపల్లి శివయ్య, వీర రామకృష్ణ, పెద్దన్న పాల్గొన్నారు.

కదిరి అర్బన్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూలై 7న వరంగల్‌లో జరుగు మాదిగల ఆత్మగౌరవ కవాతు, బహిరంగ సభను జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు నాగేంద్రనాథ్ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి చంద్రబాబు సుముఖత వ్యక్తం చేశారన్నారు. అధికారంలోకి వస్తే జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేసి, ఎస్సీలోని అన్నికులాలకు సామాజిక న్యాయం చేసే బాధ్యత తీసుకుంటానని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు చెప్పారన్నారు. బీజేపీ కూడా వర్గీకరణకు అనుకూలంగా ఉందన్నారు. మాది గల ఆకాంక్షలను మరింత బలంగా వినిపించేందుకు వరంగల్‌లో జరిగే కవాతు, బహిరంగ సభకు జిల్లాలోని మాదిగలందరూ తరలి రావాలని ఆయన కోరారు.

జట్కాస్టాండ్ వద్ద అపరిశుభ్రత తొలగింపు



జట్కాస్టాండ్ వద్ద శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ధర్మవరం, జూన్ 25: పట్టణంలోని జట్కా స్టాండ్ వద్ద ఎన్నో ఏళ్లుగా నెలకొని ఉన్న అపరిశుభ్రతను మంగళవారం తొలగించి శుభ్రం చేశారు. నిత్యం రద్దీగా ఉండే జట్కా స్టాండ్ చెత్తచెదారంతో నిండి పశువులు, పందులకు ఆవాసంగా మారింది. దీంతో అక్కడి నుంచి వచ్చే దుర్వాసనతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతుండేవారు. స్థానికులు గతంలో ఎన్నో సార్లు మున్సిపల్ అధికారులకు. ప్రజా ప్రతినిధులకు ఫిర్యాదు చేశారు. అయినా ఎవరూ స్పందించలేదు. ఇప్పుడు ఈ సమస్యను విజయవాడ పర్యటనలో ఉన్న ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ దృష్టికి ఫోన్‌ద్వారా తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి వెంటనే మున్సిపల్ కమిషనర్ రాంకుమార్‌కు ఫోన్ చేసి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ఆయన పారిశుధ్య సిబ్బంది చేత అందులోని చెత్తాచెదారాన్ని శుభ్రం చేయించారు.

'అంగన్‌వాడీ పిలుస్తోంది' ర్యాలీ

ఓబుళదేవరచెరువు, జూన్ 25: మండలంలోని గౌరాపురం గ్రామంలో మంగళవారం అంగన్‌వాడీ సిబ్బంది. చిన్నారులు కలిసి అంగన్‌వాడి పిలుస్తోంది కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో ఈ ర్యాలీ పురవీధుల గుండా సాగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లితండ్రులు మూడు నుంచి ఐదేళ్ల లోపు వయసున్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఆటలపాటల విద్యతోపాటు పౌష్టికాహారం అందించనున్నట్లు చెప్పారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ నిర్వహించి, మూడు సంవత్సరాల పిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు షమీమ్, స్వర్ణలత, వెంకటనరసమ్మ, పార్వతమ్మ, సుకన్య, సునంద, వసంతమ్మ, ఇందిర, మంజుల, ప్రమీల, కె. శ్యామల, ఎం. శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారులు కార్యకర్తలు

రాజకీయ వేధింపులు ఆపండి: సీఐటీయూ



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు

తనకల్లు, జూన్ 25: ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జీఎల్ నరసింహులు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని డంపింగ్ యార్డు వద్ద మంగళవారం నాయకుడు వేమన్న ఆధ్వర్యంలో సీఐటీయూ సభ జరిగింది. ఇందులో జీఎల్ నరసింహులు మాట్లాడుతూ.. కొన్నిచోట్ల అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతోపాటు పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లపై రాజకీయ వేధింపులు కొనసాగుతున్నాయన్నారు. వాటిని ఆపాలని కోరారు. కార్మికుల పక్షాన సీఐటీయూ పోరాటాలు కొనసాగిస్తుందన్నారు. అనంతరం మండల కమిటీని ఏర్పాటు చేశారు. మండల కన్వీనర్‌గా ఒంటెద్దువేమన్న, కోకన్వీనర్‌గా నరసింహారెడ్డి, సభ్యులుగా భాగ్యమ్మ, నాగలక్ష్మి, కళావతి, మంజుల, రాజి, రమణ, నాగేంద్ర, క్రిష్టప్పతోపాటు మరో 15మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మున్సిపల్ జిల్లా కార్యదర్శి లక్ష్మినారాయణ, జిల్లా కమిటీ సభ్యులు జగన్మోహన్, సీపీఎం మండల కార్యదర్శి శివన్న తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

గాండ్లపెంట, జూన్ 25: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు, అసిస్టెంట్ ఇంజనీర్లకు సీజనల్ వ్యాధులపై ఈఓఆర్డీ సునీత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయన్నారు. కావున ఆయా పంచాయతీల పరిధిలో మురుగు కాలువలు, కుంటలు, ట్యాంక్‌లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని సూచించారు. అలాగే బ్లీచింగ్ చల్లి లార్వాలు నశించేలా చూడాలన్నారు. ముందస్తు చర్యలు చేపడితే విషజ్వరాలు ప్రబలకుండా ఉంటాయన్నారు. ప్రజలకు ఈవిషయంపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు బాషా, శంకర్, మదన్‌మోహన్‌నాయక్, భవాని, మానస తదితరులు పాల్గొన్నారు.



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న ఈఓఆర్డీ సునీత

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు: ఆర్డీఓ

పుట్టపర్తిరూరల్, జూన్ 25: వైద్యనిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ భాగ్యరేఖ హెచ్చరించారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం పీసీ పీఎన్‌డీటీ చట్టంపై డివిజనల్‌స్థాయి అడ్వైజరీ కమిటీ సమావేశం ఆర్డీఓ ఆధ్వర్యంలో జరిగింది. ఇందులో లింగనిర్ధారణ పరీక్షలు, డెకాయ్‌ఆపరేషన్లు, లింగనిష్పత్తి అంశాలపై సమీక్ష జరిపారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ చట్టవిరుద్ధమైన లింగ నిర్ధారణ పరీక్షలపై వైద్య ఆరోగ్య, పోలీసుశాఖల వారు నిఘా ఉంచాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డెమో బాబాఫక్రోద్దీన్ మాట్లాడుతూ డివిజనల్ పరిధిలోని ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లలో ఎలాంటి లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదన్నారు. ఎవరైనా నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని, జరిమానాతో పాటు జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సునీల్‌కుమార్, మహిళా సీఐ విజయలక్ష్మి, రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజర్ శ్రీనివాసులు, మిత్రాజ్ ఫౌండేషన్ సెక్రెటరీ సవితరంగారాజన్, హెల్త్ ఎడ్యుకేటర్ అజీజ్‌ఖాన్ పాల్గొన్నారు.

నాలుగేళ్ల తరువాత కుమారుడి చెంతకు తల్లి

ధర్మవరం, జూన్ 25: ఓ తల్లి నాలుగేళ్ల తరువాత కుమారుడి చెంతకు చేరింది. స్థానిక రైల్వే పోలీసు స్టేషన్‌లో కుమారుడికి మంగళవారం ఆర్పీఎఫ్ సీఐ బోయకుమార్ అప్పగించారు. అన్నమయ్య జిల్లా గుంటపాల్యానికి చెందిన వృద్ధురాలు రెడ్డెమ్మ నాలుగేళ్ల క్రితం రైలులో తప్పిపోయింది. అప్పట్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. తిరుపతి నుంచి గుంతకల్లు వెళ్తున్న ప్యాసింజర్ రైలులో రెడ్డెమ్మను గురుశేఖర్ స్నేహితుడు గమనించాడు. వెంటనే గురుశేఖర్‌కు ఫోన్‌చేసి, విషయం తెలిపాడు. గురుశేఖర్ ఆన్‌లైన్‌లో ఫొటో సహా ఆర్పీఎఫ్‌కు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు ఆర్పీఎఫ్ ఏఎస్‌ఐ వెంకటరావు.. సిబ్బందితో తిరుపతి ప్యాసింజర్ రైలు సోమవారం ధర్మవరం రైల్వేస్టేషన్‌కు రాగానే.. అందులో ఉన్న రెడ్డెమ్మను ఫొటో ఆధారంగా గుర్తించారు. ఆమెను స్టేషన్‌కు తీసుకెళ్లి, గురుశేఖర్‌కు సమాచారం అందించారు. మంగళవారం ఉదయం గురుశేఖర్ ధర్మవరం ఆర్పీఎఫ్ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. ఆర్పీఎఫ్ సీఐ బోయకుమార్, ఏఎస్‌ఐ వెంకటరావు.. రెడ్డెమ్మను కుమారుడు గురుశేఖర్‌కు అప్పగించారు. కాగా, కుమారుడు ప్రేమ వివాహం చేసుకోవడంతో అలిగి రెడ్డెమ్మ ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.



రెడ్డెమ్మను కుమారుడికి అప్పజెబుతున్న ఆర్పీఎఫ్ సీఐ

వీధిలైట్లకు మరమ్మతులు



వీధిలైట్లను మరమ్మతు చేస్తున్న దృశ్యం

ధర్మవరం, జూన్ 25: పట్టణంలోని 25వ వార్డులో మున్సిపల్ సిబ్బంది వీధి లైట్లను మరమ్మతు చేశారు. గత కొన్నిరోజులుగా వార్డులో వీధిలైట్లు వెలగడం లేదని, దీంతో చీకటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ భీమనేని ప్రసాద్‌నాయుడు దృష్టికి తెచ్చా రు. ఆయన ఈ విషయాన్ని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాలశ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మున్సిపల్ అధికారులు మంత్రి సత్యకుమార్‌యాదవ్, పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు మంగళవారం వీధిలైట్లను మరమ్మతు చేయించి సమస్యను పరిష్కరించారు.

పిల్లల పట్ల కఠినంగా ఉండరాదు

కొత్తచెరువు, జూన్ 25 : మండల కేంద్రంలోని పీఆర్‌డీఎస్ కార్యాలయంలో మంగళవారం బాలల పరిరక్షణ సమితి, ప్రభాత్‌రూరల్ డెవలెప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఇందులో ఇండియన్ ఫౌండేషన్ జిల్లా ప్రతినిధి కొండప్ప మాట్లాడుతూ.. తల్లిదండ్రులు పిల్లలు పట్ల కఠినంగా ఉండరాదన్నారు. ప్రస్తుతం పిల్లలు సెల్‌ఫోన్‌లకు, వీడియో గేమ్‌లకు బానిసలవుతున్నారని, తల్లిదండ్రులు అప్రమత్తమై వాటిని దూరం చేయాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలను ఆప్యాయతగా దగ్గరకు చేరదీసి వారి ఆలనాపాలనా చూసినప్పుడు వారు ఇతరవ్యసనాల వైపు ఆకర్షితులు కారని తెలిపారు. పిల్లల పట్ల కఠిన వైఖరి అవలంబించరాదన్నారు. కార్యక్రమంలో పీఆర్‌డీఎస్ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, జిల్లా బాలల సంరక్షణ సమితి ప్రొటెక్షన్ అధికారి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్య పరిష్కరించండి

ముదిగుబ్బ, జూన్25: మండలంలో చుక్కల భూముల సమస్యను పరిష్కరించాలని సీపీఐ మండల కార్యదర్శి చల్లా శ్రీనివాసులు మంగళవారం ఒక ప్ర కటనలో కోరారు. మండలంలో కొన్ని సంవత్సరాలుగా పట్టా భూములు చుక్కల జాబితాలో ఉన్నాయన్నారు. అవి రిజిస్ట్రేషన్ కాక రైతులు ఇబ్బందులు పడుతున్నా రన్నా రు. గత వైసీపీ ప్రభుత్వంలో సమస్యను పరిష్కరించాలని అధికారులతో మొరపెట్టుకున్నా.. ఎవరూ పట్టించుకోలేదన్నారు. రైతుల తరఫున సీపీఐ ఆధ్వర్యంలో పలుమార్లు ఉద్యమాలు చేసినా.. గత వైసీపీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వమైనా చుక్కల భూముల సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు.

రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా జీఎం శేఖర్

పుట్టపర్తిరూరల్, జూన్ 25: రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ మరోసారి ఎంపికయ్యారు. ఈయన మూడేళ్లుగా రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. తాను చేపట్టిన సేవాకార్యక్రమాలను గుర్తించి మరోసారి అవకాశం కల్పించినట్టు మంగళవారం ఆయన తెలిపారు. రెడ్‌క్రాస్ సం స్థ కేంద్రప్రభుత్వ అధీనంలోని వైద్యఆరోగ్యశాఖ పరిధిలో పనిచేస్తుందని తెలిపారు. రెండోసారి ఎంపికైన జీఎం శేఖర్‌ను బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండమరాజు, నాయకులు హరికృష్ణ, జ్యోతిప్రసాద్, రామాంజనేయులు, మల్లికార్జున తదితరులు అభినందించారు.

గ్రంథాలయం తనిఖీ

ముదిగుబ్బ, జూన్25: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమా మంగళవా రం తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎంపీడీఓ నాగ శేషాచలరెడ్డిని కలిసి పంచాయతీల నుంచి రావాల్సిన గ్రంథాలయ సెస్సు బకాయిలు సంస్థ నిధులకు జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాల ని కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ కృష్ణ కుమార్, గ్రంథాలయ అధికారి బొజ్జే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

28న ప్రాంగణ నియామకాలు

అనంతపురం సెంట్రల్ : నగరంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో శుక్రవారం ప్రాంగణ నియామకాల ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల్లో చివరి సంవత్సరం విద్యార్థులకు, ఇదివరకు ఐటీఐ పూర్తిచేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా కరియమ్మ ఉత్సవాలు


కరియమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్న భక్తులు

అగళి, జూన్ 25 : మండలంలోని నందరాజనపల్లి గ్రామంలో రెండు రోజులుగా దేవనల్లి కరియమ్మ దేవత ఉత్సవాలను ఘనంగా నిర్వమించారు. ఇందులో భాగంగా మంగళవారం మహిళలు భక్తిశ్రద్ధలతో హారతులను ఊరేగింగా తీసుకొచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నందరాజనపల్లిలో పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారిని ఊరేగింపుగా తీసుకెళ్లి ఇంటింటా పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయండి: టీడీపీ

రొళ్ల, జూన్ 25: అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం మొదటి సారిగా మడకశిరకు వస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని రాష్ట్ర వక్కలిగ కన్వీనర్ వీఎం పాండురంగప్ప, జిల్లా టీడీపీ కార్యదర్శి రవిభూషణ్, మండల కన్వీనర్ దాసిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈరన్న కోరారు. వారు ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మడకశిరలో నిర్వహించే ఈ కార్యక్రమానికి మండలం నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు.

గోవధను అరికట్టాలని వినతి

పెనుకొండ టౌన్, జూన్ 25: నియోజకవర్గంలో గోవధను అరికట్టాలని మంగళవారం డీఎస్పీ బాజీజాన్ సైదాకు విశ్వహిందూపరిషత్ సభ్యులు మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పెనుకొండ నియోజకవర్గంలో గోవుల అక్రమ రవాణా జరుగుతోందని వాటిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. డీఎస్పీ స్పందిస్తూ గోవధ, గోవుల అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

సక్రమంగా రేషన్ అందించండి: సీఎస్‌డీటీ

మడకశిర రూరల్, జూన్ 25: మండలంలోని ఎఫ్‌పీ షాపుల్లో పేదలకు అందించే బియ్యం సక్రమంగా పంపిణీ చేయకపోతే... అటువంటి డీలర్లు, ఎండీయూ వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు హారతి పేర్కొన్నారు. ఆమె మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఎండీయూ వాహనదారులతో సమావేశాన్ని నిర్వహించారు. బియ్యంకార్డుల లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయకపోతే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మడకశిర పసుపుమయం

ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు


స్వాగతానికి ఏర్పాట్లు చేస్తున్న నాయకులు

మడకశిరటౌన్, జూన్ 25: స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం తొలిసారిగా బుధవారం మడకశిరకు రానున్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు మడకశిర పట్టణంలోని వాల్మీకి సర్కిల్ నుంచి విజయోత్సవ ర్యాలీ నిర్వహి స్తున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి తెలిపారు. ఆయన మంగళవారం ఏర్పాట్లను పర్య వేక్షించారు. అతి తక్కువ సమయంలోనే మడకశిర ప్రజలు ఎంఎస్ రాజును అక్కున చేర్చుకొని ఆశీర్వదించారని, ప్రజల నమ్మకా న్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామన్నారు.

అన్న క్యాంటీన్ ప్రారంభానికి చర్యలు : గుండుమల

మడకశిరటౌన్, జూన్ 25: పట్టణంలోని పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటిన్ పునః ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమ ల తిప్పేస్వామి అన్నారు. ఆయన మంగళ వారం అన్నా క్యాంటిన్ ప్రారంభానికి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గుండుమల మాట్లాడుతూ... ఎందరో పేదల ఆకలి తీర్చాలనే సదుద్దేశ్యంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటిన్లను చంద్రబాబుకు పేరొస్తుందన్న దురుద్దేశంతో 2019లో అధికారంలోకి వచ్చిన జగన్ మూసి వేయించార న్నారు. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చిందని, వెంట నే పట్టణంలోని అన్న క్యాంటిన్ భవనానికి మరమ్మ తులు చేయించి ప్రతి రోజు పేదలకు రూ.5కే భోజనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మనోహర్, మున్సిపల్ మాజీ చైర్మన్ నరసింహరాజు, నాయకులు బేగార్లపల్లి రవి, తిమ్మరాజు, అక్కంపల్లి బాబు తదితరులు ఉన్నారు.

ఎట్టకేలకు ట్రాన్స్‌ఫార్మర్ మార్పు


ట్రాన్స్‌ఫార్మర్‌ను రహదారి పక్కకు మారుస్తున్న అధికారులు

మడకశిరటౌన్, జూన్ 25: పట్టణంలోని రాజీవ్‌గాంధీ సర్కిల్‌లో రహదారి మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎట్టకేలకు మంగళవారం తొలగించి రోడ్డు పక్కకు మార్చారు. పదేళ్ల నుంచి ఆ ట్రాన్స్‌ఫార్మర్ పక్కకు మార్చాలని అధికారులు, ప్రజా ప్రతినిధులకు ఎంతో మంది ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి చొరవతో ఎట్టకేలకు ట్రాన్స్‌ఫార్మర్ మార్పునకు మోక్షం కలిగింది. బెంగళూరు, పావగడ, హిందూపురం, అనంతపురం తదితర ప్రాంతాలకు ప్రతినిత్యం ఆ మార్గం నుంచే వాహనాలు వెళ్లాల్సి ఉంది. ఇటీవల ట్రాన్స్ ఫార్మర్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందారు. ఆ ట్రాన్స్ ఫార్మర్ ప్రమాదకరంగా ఉందని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి దృష్టికి పట్టణ వాసులు, ప్రయాణికులు తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వారు విద్యుత్ శాఖ అధికారులను పిలిపించి సమస్య పరిష్కరించాలని కోరారు. వెంటనే విద్యుత్ శాఖ అధికారులు సమీపంలోని రహదారి పక్కన ప్రజలకు ఇబ్బందులు లేకుండా ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చారు. దీంతో పట్టణ వాసులు ఎమ్మెల్యేకు , గుండుమల తిప్పేస్వామికి కృతజ్ఞతలు తెలిపారు.

రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్‌గా రెండోసారి జీఎం శేఖర్

గోరంట్ల, జూన్ 25: జాతీయ రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్మన్‌గా గోరంట్లకు చెందిన జీఎం శేఖర్ రెండోసారి నియమితులయ్యారు. గత రెండేళ్లుగా రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్‌గా ఆయన విశేష సేవలందించారు. ఆయన సేవలను గుర్తించి, మరోసారి చైర్మన్‌గా అవకాశం కల్పించినట్లు బీజేపీ నాయకులు ఓప్రకటనలో తెలిపారు. పలువురు బీజేపీ నాయకులు, అభిమానులు జీఎం శేఖర్‌కు అభినందనలు తెలిపారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి

సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి వాసుదేవన్

పెనుకొండ టౌన్, జూన్ 25 : పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈనెల 29న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి, మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు టీ వాసుదేవన్ పేర్కొన్నారు. న్యాయాధికారి మంగళవారం కోర్టు ఆవరణంలోని కోర్టుహాల్‌లో న్యాయవాదులు, మునిసిపల్ కమిషనర్, బ్యాంక్ మేనేజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ... అత్యధికంగా బ్యాంకు రుణాలకు, మునిసిపాలిటీకి సంబంధించిన కేసులున్నాయన్నారు. ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. రాజీమార్గంలో పోయి ప్రశాంతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బుజ్జప్ప, ఏజీపీ భాస్కర్‌రెడ్డి, కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నకొడుకే కడతేర్చాడు: సీఐ


మృతురాలి కొడుకు ఆంజనేయులు


మరో నిందితుడు ప్రభాకర్

పావగడ, జూన్ 25: ఆంధ్రాలోని మడకశిర మండల పరిధిలోని ఎల్లోటి గ్రామానికి చెందిన వడ్డె చంద్రక్క హత్య కేసులో ఆమె కన్న కొడుకే హంతకుడని ప్రాథమిక విచారణలో తేలినట్లు పావగడ పోలీసుల తెలిపారు. పావగడ సీఐ సురేష్ మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మడకశిర మండలం ఎల్లోటి గ్రామానికి చెందిన వడ్డె చంద్రక్కను ఈనెల 20 వతేదీన పావగడ సరిహద్దు ప్రాంతమైన మాచరాజన హళ్లి అటవీ ప్రాంతంలో గొంతుకోసి నగదు, బంగారం దోచుకెళ్లిన సంఘటన తెలిసిందే. పావగడ పోలీసులు తమదైన శైలిలో దర్యాప్తు చేపట్టారు. ఆమె కొడుకు, కోడలిపై అనుమానంతో లోతుగా విచారణ చేపట్టగా కొడుకే హంతకుడని తేలింది. మృతురాలు చంద్రక్కకు పదేళ్ల క్రితం ప్రభుత్వం ఐదెకరాల భూమిని పంపిణీ చేసింది. ఆమె ఆ భూమిని తన కుమార్తెకు రాసిస్తానని చెబుతుండేది. అయితే ఆ భూమిని తనకు ఇవ్వాలని కొడుకు ఆంజనేయులు తల్లిని తరచూ కోరుతుండేవాడు. చివరకు చంద్రక్క తనకు పొలం రాసివ్వదని పగబ ట్టిన కొడుకు ఆంజనేయులు, పావగడ తాలూకా సూర్యనాయకనహళ్లికి చెందిన తన బావమరిది ప్రభాకర్‌తో కలిసి పథకం వేశాడు. గురువారం ఉదయం తన పొలానికి వెళ్లిన చంద్రక్క కాళ్లను పట్టుకుని, కన్న కొడుకే గొంతుకోసి శవాన్ని అటవీ ప్రాంతంలో పడేశాడు. ఆమె వద్ద ఉన్న నగదు, చెవికి ఉన్న కమ్మలు కూడా లాక్కెళ్లాడని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదుచేసి నిందితులను జైలుకు తరలించినట్లు సీఐ సురేష్ వివరించారు.

'డ్రగ్స్ రహిత సమాజం నిర్మిద్దాం'

పెనుకొండ, జూన్ 25 : డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఎస్ఐ రాజేష్ పేర్కొన్నారు. స్థానిక జూనియర్ కళాశాలలో మంగళవారం డ్రగ్స్ నిరోధంపై ప్రిన్సిపాల్ సుదర్శన్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ రాజేష్ మాట్లాడుతూ ర్యాగింగ్, సైబర్ నేరాలు, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంగింపు, అతిగా సెల్‌ఫోన్ వాడకం వల్ల కలిగే అనర్థాలు, విద్య ఆవశ్యకత తదితర విషయాలను తెలియజేశారు. మహిళా కానిస్టేబుల్ రాధ మాట్లాడుతూ తాను చదివిన కళాశాలకు ముఖ్య అతిథిగా రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విద్యార్థులతో తన సంతోషాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మూర్తి, రామచంద్రయ్య, శివన్న, సుధారాణి, సుశీల, హారిక, ఉమాశంకర్, ఎన్ఎస్ఎస్ పీఓలు హఫీజ్, శంకర్‌నాయక్, శ్రీలేఖ, విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

పాఠశాలను పునఃప్రారంభించండి

ఎంఈఓకు భీమరాయణపల్లివాసుల వినతి

మడకశిర రూరల్, జూన్ 25: మండలంలోని భీమరాయణపల్లిలో మూతపడిన పాఠశాలను మళ్లీ ప్రారంభించాలని ఆ గ్రామస్థులు, విద్యార్థి తల్లిదండ్రులు ఎంఈఓ భాష్కర్‌ను కోరారు. ఎంఈఓ మంగళవారం భీమరాయ ణపల్లిలో మూడపడిన పాఠశాల భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ... విద్యార్థులు లేరని గత వైసీపీ ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం పాఠశాలను మూసివేసిందన్నారు. అప్పటి నుంచి గ్రామంలోని విద్యార్థులు దూరప్రాం తంలో ఉన్న పాఠశాలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో 32 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు. మూతపడిన పాఠశాలను మళ్లీ తెరవాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎంఈఓ భాష్కర్ మాట్లాడు తూ జూలై 1 నుంచి పాఠశాలను ప్రారంభించేందుకు సంబంధించిన రికార్డులను తయారుచేసి డీఈఓకు పంపామన్నారు. ఆదేశాలు రాగానే పాఠశాలను ప్రారంభిస్తామని తెలిపారు.

కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలి: ఎమ్మెల్యే వెంకటేశ్

పావగడ, జూన్ 25 : మనిషి అవయవాల్లో కళ్లు ఎంతో ప్రధానమైనవని వాటిని ఆరోగ్యంగా కాపాడుకోవాల్సిన బాధ్యత ఎవరికివారిదేనని ఎమ్మెల్యే వెంక టేశ్ తెలిపారు. తాలూకా పరిధిలోని వైఎన్ హొసకోటలో జిల్లా ఆరోగ్య కార్యాల యం, సిద్దార్థ వైద్య కళాశాల, శారదాదేవి కంటి ఆసుపత్రి, ఇన్ఫోసిస్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి మాట్లాడారు. అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తుపై నిఘా ఉంచి వారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలని పావగడ జపానందస్వామి తెలి పారు. విద్యార్థులకు అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో న్యాయవాది భగ వంతప్ప, కాంగ్రెస్ నాయకులు సుదేష్‌బాబు, షంబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు చంద్రబాబు ఫొటోల పంపిణీ

హిందూపురం అర్బన్, జూన్ 25: పరిగి మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు సీఎం చంద్రబాబు, బీసీ సంక్షేమ శాఖామంత్రి సవిత పొటోలను తెలుగు యువత జిల్లా కార్యాదర్శి ప్రవీణ్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆయన మంగళవారం టీడీపీ నాయకు లతో కలిసి ప్రభుత్వ కార్యాలయాల వద్దకు వెళ్లి అందించారు.

అప్పట్లో చీకటి పాలనకు కాంగ్రెస్ శ్రీకారం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్

గోరంట్ల, జూన్ 25: మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ అధికార దాహంతో 1975 జూన్ 25న దేశంలో ఎమర్జెన్సీ విధించి చీకటి పాలనకు కాంగ్రెస్ శ్రీకారం చుట్టారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పేర్కొన్నారు. గోరంట్లలోని కెంపుల ఫంక్షన్ హాల్‌లో బీజేపీ ఆధ్వర్యంలో ఎమె ర్జెన్సీ వ్యతిరేక దినాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం శేఖర్ మాట్లాడు తూ.... అప్పుడు ఇందిరాగాంధీ ప్రకటించిన అత్యసర పరిస్థితిని ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించారని తెలిపారు. ఏఎన్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కెంపుల లక్ష్మీనారాయణ మాట్లాడతూ... ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ జనసంఘ్ తరపున విద్యార్థినాయకుడిగా హిందూపురంలో పోరాటం చేసి, అరెస్టు అయిన వైనం వివరించారు. ఆయనను బీజేపీ నాయకులు శాలువ, పూలమాల, మెమెంటోతో సత్కరించారు. కార్యక్రమంలో ఎస్వీఎం కళాశాల ప్రిన్సిపాల్ భక్తవత్సలం, బీసీ రెడ్డి, డీకే శ్రీనివాసులు, బీజేపీ నాయకులు రమణమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, మేదర శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో మెలకువలు పాటించండి

రైతు శిక్షణ కేంద్రం అధికారులు

చిలమత్తూరు, జూన్ 25: ఖరీఫ్‌లో సాగుచేస్తున్న వేరుశనగ, మొక్కజొన్న, కంది పంటల్లో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని పుట్టపర్తి రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ లు సనావుల్లా, అబ్దుల్ అలీ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో మంగళవారం సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రధానంగా విత్తనాలు విత్తే ముందు విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలన్నారు. పంటల్లో కలుపునివారణ, దుక్కిలో సేంద్రియ ఎరువుల వినియోగం, మందులు, రసాయనిక ఎరువుల వాడకం తగ్గింపు తదితర విషయాలపై వివరించారు. పంటలో అతిగా రసాయనిక ఎరువులు, మందులు వాడితే దుష్ప్రభావంతో పాటు పెట్టుబడులు పెరుగు తాయని తెలిపారు. ప్రధానంగా పంటలో మిత్రపురుగులకు నష్టం కలగకుండా జాగ్రత్తపడాలన్నారు. డ్రోన్ స్ప్రేయర్ ద్వారా పంటపై మందుల పిచకారి చేయడంపై వివరించారు. మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ, విస్తరణాధికారి శ్రీవిద్య, రైతు భరోసా కేంద్ర సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.